


"శ్రీ పరాభవ" నామ సంవత్సర ఉగాది సందర్భంగా
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
31 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
ఉత్తమ కథానిక విభాగం - ప్రశంసా పత్రం

# చచ్చేంత ప్రేమ!

- డాక్టర్ ఎమ్ సుగుణ రావు, విశాఖపట్నం

**మా అపార్ట్‌మెంట్ బాల్కనీలో నుంచున్నాను.**

అది ఫిబ్రవరి మాసపు ఉదయమైనా... వాతావరణం చల్లగానే ఉన్నా నా మనసు వేడిగా ఉంది. నా కిష్టమైన ఫిల్టర్ కాఫీ తాగుతున్నా అది చేదుగా అనిపించింది.

రెండు వందల ఇళ్ళున్న మా గేటెడ్ కమ్యూనిటీలో ఉదయంపూట సందడి మొదలైంది.

వాకింగ్ పెవిలియన్ మీద నడుస్తున్న సీనియర్ సిటిజన్‌లు... పిల్లలకి యూనిఫాంలు వేసి, స్కూళ్ళకు తరుముతున్న తల్లులు... ఇంకా ఆఫీసులకు బయలుదేరుతున్న ఉద్యోగులు...

నేను హైదరాబాదు వచ్చి పదేళ్ళయ్యింది. పేరున్న ఒక జాతీయ దినపత్రికలో సీనియర్ ఎడిటర్‌ని. నా శ్రీమతికి సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగముంది. నా ఎమ్.ఎ. తెలుగుతో పాటు చేసిన జర్నలిజం డిగ్రీ ద్వారా నా అభిరుచికి తగ్గ ఉద్యోగం దొరికింది.

చన్నీళ్ళకు వేన్నీళ్ళుగా నా శ్రీమతి చేస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వల్ల ఈ హైదరాబాద్ నగరంలో ఒక స్థిరనివాసం ఏర్పరచుకోగలిగాం.

ఆలోచనలో ఉన్న నాకు హఠాత్తుగా, ఆ ఉదయంపూట మనసును మెలిపెట్టిన విషయం గుర్తువచ్చింది.

అది నా తోడబుట్టిన అక్కయ్య నుంచి వచ్చిన చరవాణి సమాచారం. అక్క ఎంతో ఆవేదనగా తనలో గూడు కట్టుకుంటున్న బాధని చెప్పిన క్షణం నుంచి నా మనసు మనసులో లేదు. ఆమె చెప్పిన విషయం గురించి ఆలోచిస్తూనే కాఫీ తాగడం పూర్తిచేసి, బాల్కనీలోంచి లోపలకి కదిలాను.

నా శ్రీమతి ఆఫీస్‌కు తయారవుతూనే, ప్లస్ టు చదువుతున్న నా కూతుర్ని కూడా తయారుకమ్మని హడావుడి చేస్తోంది.

నా కూతుర్ని చూడగానే మళ్ళీ నాకు అక్కయ్య గుర్తుకొచ్చింది. తను అక్కయకు ఫొటో కాపీ. అలాగే అక్కయ్య కూతురు రేణుకను నా కూతురు పక్కన నుంచోబెడితే, ఇద్దరూ అక్కాచెల్లెళ్ళు అనుకుంటారు. రేణుక గుర్తురాగానే మళ్ళీ మనసు మెలిపెట్టింది.

అక్కయ్య, రేణుక గురించి చెప్పిన విషయాలు గుర్తు చేసుకుంటుంటే ఏదో బాధ. నరనరాల్లో ఒత్తిడి. ఆ విషయం నా శ్రీమతి గమనించింది.

తనకి నేను మధనపడుతున్న విషయం గురించి తెలుసు.

“రిలాక్స్ అవ్వండి. ప్రతి సమస్యకూ పరిష్కారం ఉంటుంది. మీరు చాలా మానసిక అలజడిలో ఉన్నట్టున్నారు. ఈ రోజు ఆఫీసుకు సెలవు పెట్టేయండి. ఈ ట్రాఫిక్‌లో కారు డ్రైవ్ చేయగలరా? మీమిద్దరం కాబ్‌లో వెళ్ళిపోతాం” అంది.

“అబ్బే అదేమీ లేదు. నేను క్షణంలో తయారై వస్తాను. పైగా మాకీరోజు ముఖ్యమైన మీటింగుంది. నేను తప్పనిసరిగా హాజరుకావాలి.” అంటూ మనసును బలపరుచుకుని బాత్రూంలోకి నడిచాను.

నేను ఆఫీసుకు వెళుతూ, దారిలోనే ఉన్న నా శ్రీమతి ఆఫీసుదగ్గర ఆమెను దింపి, ఆ తర్వాత నా కూతుర్ని కాలేజీలో వదిలాను. ఇది రోజూ జరిగే దినచర్య. సికింద్రాబాద్ పేరడేజ్ సర్కిల్ దగ్గర ఉన్న మా దినపత్రిక కార్యాలయానికి చేరుకునేసరికి ఉదయం పది దాటింది. ఐదంతస్తులున్న మా ఆఫీసు కార్యాలయంలో రెండో ఫ్లోర్‌లో ఉంది నా కాబిన్. వెళ్ళేసరికి ఆఫీసు అటెండెంట్ `

“చీఫ్ ఎడిటర్ గారు మీటింగ్ ఉందని చెప్పారు సార్. పదకొండు గంటలకు, సిండికేటు రూములో” అన్నాడు.

“తెలుసు...” అంటూ నా కాబిన్‌లోకి వెళ్ళి కంప్యూటర్‌లో లాగినయ్యాను. నా మనసులో రేగిన అలజడిని తగ్గించుకోవడానికి రెండు వారాల తర్వాత రాబోయే ఆదివారం అనుబంధం సంచికకు సిద్ధం చేసిన కథలు, ఫీచర్లు... వాటిపై దృష్టిసారించాను.

సండే సప్లిమెంటు ఇన్‌చార్జ్‌ని నేనే. పదిహేను రోజులు ముందుగానే రాబోయే సంచికకు ఆర్టికల్స్, కథలు సిద్ధం చేస్తాం. అయితే ఈరోజు చీఫ్ ఎడిటర్ మీటింగ్ దేనికి పెట్టినట్టు?

వెంటనే అర్థమైంది... ఆరు నెలల్లో రాబోయే స్పెషల్ బులిటెన్ గురించి, దానికి సంబంధించిన సంపాదక సభ్యులతో ఆయన సమావేశమౌతాడు.

మా పత్రిక చీఫ్ ఎడిటర్ చంద్రశేఖర్ చాలా ప్రొయాక్టివ్. ‘రేపటి పని ఈరోజే చేయాలి’ అనే టైం బౌండ్‌తో ఆర్నెల్లు ముందుగానే చేయాల్సిన పని గురించి ప్రణాళికలు రూపొందిస్తాడు.

ఈసారి బులిటెన్ ఏ విషయంమీదో? నా ఊహకు అందలేదు. ‘సరే... ఎలాగూ తెలుస్తుంది కదా’ అనుకుంటూ... పదకొండు కావటంతో మీటింగ్ జరిగే సిండికేట్ హాలుకు చేరుకున్నాను.

అప్పటికే చంద్రశేఖర్ గారు, ఇంకా మా సహచర సంపాదక సభ్యులు ఆ హాల్లో కూర్చున్నారు.

నేను “గుడ్ మార్నింగ్ సార్” అనగానే..

“కూర్చోండి” అంటూ నవ్వుతూ చూసి “ఇక అందరూ వచ్చేసినట్టే కదా..” అంటూ చెప్పడం మొదలెట్టాడు.

“మీకు ఈపాటికి అర్థమయ్యే ఉంటుంది.. ఈ మీటింగ్ ఎందుకు పెట్టామో... మనం తీసుకురాబోయే స్పెషల్ ఇష్యూ కోసం ఈ మీటింగ్. ఇంతవరకు మనం వ్యవసాయం, పశుపోషణ, టీనేజ్ సమస్యలు, గ్లోబల్ వార్మింగ్, కార్పొరేట్ చదువులు... ఈ టాపిక్‌లమీద బులిటెన్‌లు రిలీజ్ చేశాం. ఈసారి మనం ఏ టాపిక్ మీద బులిటెన్ తీసుకొస్తున్నామో మీకేమైనా ఐడియా ఉందా?” అన్నాడు.

నాతో సహా అందరూ తల అడ్డంగా ఊపారు.

“సెప్టెంబర్ 10 ప్రాముఖ్యత ఏమిటో మీకు తెలుసా?” అన్నాడు.

అందరూ ఆలోచనలో పడ్డారు. కాని ఎవరూ సమాధానం చెప్పలేదు.

చంద్రశేఖర్ ఇలాగే ప్రశ్నలు వదులుతారు. తను చెప్పే విషయం మీద వినేవారికి ఆసక్తి కలగాలని ఆయన ప్రశ్నలు సంధిస్తారు. ఎవరూ సమాధానం చెప్పకపోయేసరికి `

"మీకొక ముఖ్య విషయం చెప్పబోతున్నాను. ప్రతి 45 సెకండ్లకి ప్రపంచంలో ఏదో ఒకచోట బలవన్మరణానికి పాల్పడుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం సంవత్సరానికి ఎనిమిది లక్షల మంది ఆత్మహత్య చేసుకుంటున్నారు. మనదేశంలోనే కాదు, ప్రపంచ వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల తర్వాత చావులకు ప్రధాన కారణం... ఆత్మహత్యే. అయితే ఈ ఆత్మహత్యల్లో పదిహేనేళ్ళ నుంచి ఇరవై తొమ్మిదేళ్ళ మధ్య వయసువారే ఎక్కువ."

ఆ విషయం చంద్రశేఖర్ చెప్పగానే, నా మనసులో అలజడి మొదలైంది. దాన్ని నియంత్రించుకుంటూనే, ఆయన మాటలవైపు దృష్టిసారించాను.

"కుటుంబంలోని ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకుంటే, దాని ప్రభావం ఆ కుటుంబం మీద పడుతుంది. అలాగే ఒక ఆత్మహత్య వల్ల 135 మంది దాకా ప్రభావితం అవుతారట! ఈ ఆత్మహత్య అనేది ఒకరకంగా అంటువ్యాధే. ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న ఆత్మహత్యల నివారణకు అందరూ కృషి చేయాలని, డబ్ల్యుహెచఓ కోరుతోంది. సెప్టెంబర్ 10ని 'ప్రపంచా ఆత్మహత్యల నివరాణ దినోత్సవం'గా నిర్ణయించారు. మన స్పెషల్ ఇష్యూ సంచిక థీమ్ 'ఆత్మహత్యలు ` నివారణ'. ఇక ఆర్నెల్లు టైం మాత్రమే ఉంది మనకు. ఆత్మహత్యలకు సంబంధించిన వార్తా కథనాలు, దాంతోపాటు సైకాలజిస్టులతో ఇంటర్వ్యూలు, ఆత్మహత్యల బారినపడ్డ బాధిత కుటుంబాల పరిస్థితి తర్వాత ఎలావుందీ..? వీటితో మన బులిటెన్ తీర్చిదిద్దాలి. ఈ బులిటెన్ మన సీనియర్ కొలిగ్ రామ్మోహన్ నిర్వహణలో జరుగుతుంది" అంటూ ఆయన నావైపు నవ్వుతూ చూశారు.

"ఓకే సార్... డన" అన్నాను బొటనవేలు పైకెత్తి.

"ఇక సమావేశం ముగిసింది. మీరందరూ నేను చెప్పిన పనిలో ఉండండి. రామ్మోహన్ గారూ... మీరు మాత్రం ఉండండి, మాట్లాడాలి" అన్నాడాయన.

అందరూ వెళ్ళిపోయిన తర్వాత ఆయన నావంక చూసి `

"ఈ బులిటెన్ కోసం మీరొక స్పెషల్ ఆర్టికల్ రాయాలి. ఆ విషయం మీరు రాయగలరు." అన్నాడు.

"చెప్పడి సార్" అన్నాను.

"రచయితలు, కళాకారులు మానసికంగా బలంగా కనిపించినా, సున్నిత మనస్కులు. మానసికమైన రుగ్మతలు వీరిలోనే ఎక్కువని అంటుంటారు. చాలా ఉత్తమమైన సాహితీ సృజన చేసినవారు మానసికంగా బలహీనపడి, ఆత్మహత్యలు చేసుకున్న విషయాలు గురించి మనకు తెలుసు. అలాంటి చాలా విషాదంగా జీవితాలను ముగించిన కవులు, కథకులు, నవలాకారులు గురించిన ఒక ఆర్టికల్ మీరు రాయాలి. మన దినపత్రిక ఇంగ్లీషు, తెలుగు, తమిళం, మళయాళం, కన్నడం, హిందీ ఇంగ్లీషుల్లో కూడా వస్తుంది కదా. ఈ బులిటెన్ అలా అన్ని ప్రాంతాల పాఠకుల్ని దృష్టిలో పెట్టుకొని రావాలి. మీరు ఇక ఆ పనిమీద ఉండండి. ఆల్ ది బెస్ట" అన్నాడాయన.

"ఓకే సార్..." అంటూ ఆయనకు నమస్కారం చేసి, ఆ సిండికేటు రూమ్‌లోంచి బయటకొస్తుంటే..

"ఒక్క నిముషం రామ్మోహన్ గారూ... అన్నట్టు మన ఇంగ్లీషు విభాగం వారు, మీకు చెప్పిన ఆర్టికల్‌కి ఒక పేరు సిద్ధం చేశారు. వినండి..." అన్నాడాయన.

"చెప్పండి సార్..." అన్నాను.

"Pens that awoke in death లేదా Dreams that awoke in death"

ఆయన ఆ మాటలు చెప్పగానే, వాటిని పదే పదే మనన చేసుకుంటూ `

“బావున్నాయి సార్... ‘మరణంలో మేల్కొన్న కలములు’ లేదా ‘మరణంలో మేల్కొన్న కల(ము)లు’. ఈ రెండింటిని కలిపి మరణంలో మేల్కొన్న కల(ము)లు.”

“సూపర్ భలే చెప్పారు. అందుకే మీ క్రియేటివిటీ గురించి మన పత్రిక యాజమాన్యానికి తెలిసి, మిమ్మల్ని పూర్తిగా వాడేసుకుంటున్నారు.” అన్నాడాయన నవ్వుతూ.

“ఫర్వాలేదు సార్... దానికి తగ్గ ప్రతిఫలం నాకు ఇస్తున్నారు కదా. మీరు చెప్పిన పనిమీదే ఉంటాను.” అంటూ ఆయన కాబిన్ లోంచి బయటకొచ్చాను.

సీట్లో కూర్చునేసరికి, ఫోన్ రింగయ్యింది. అక్కయ్య నుంచి ఫోన్.

ఫోనెత్తి “మళ్ళీ ఫోన్ చేస్తాను. కంగారుపడకు అన్నీ సర్దుకుంటాయ” అని చెప్పి ఫోన్ పెట్టేశాను కానీ, మనసులో మళ్ళీ ప్రశ్నార్థకం!

రేణుక సమస్యను ఎలా హాండిల్ చేయాలి? అనుకుంటూ ఆలోచనలో పడ్డాను. దాదాపు సంవత్సరం నుంచి నలుగుతున్న సమస్య.

రేణుక నాకంటే పదేళ్ళు చిన్నది. ఆమెను ఎత్తుకొని ఆడించేవాడిని కూడా. కుటుంబంలో రేణుక అంటే అందరికీ ముద్దే. కారణం మా కుంటుంబాలలో ఆడపిల్లల జనాభా తక్కువ. రేణుక చిన్నప్పటినుంచీ మంచి మార్కులతో పాసయ్యేది. ఇంటర్మీడియట్ తర్వాత, పేరున్న కాలేజీలో ఇంజనీరింగ్ సీటొచ్చింది. ఇంజనీరింగ్‌లో ఉండగానే ఒకబ్బాయితో ప్రేమలో పడింది. అతని పేరు శ్రీకాంత్. కులాలు వేరైనా అతడు లేకపోతే బ్రతకలేను అని గొడవ పెట్టడంతో రేణుకను అతనికిచ్చి పెళ్ళి చేశారు. ఇద్దరికీ మల్టీనేషనల్ కంపెనీలో ఉద్యోగాలు. పెళ్ళైన సంవత్సరానికే కారు, ఇల్లు ఏర్పాటు చేసుకున్నారు. ప్రతీదీ ఇద్దరూ షేర్ చేసుకునేవారు. అతను ప్రాజెక్ట్ పనిమీద అమెరికాలో ఒక సంవత్సరం ఉండాల్సొచ్చింది. అప్పటికి రేణుకకు డెలివరీ టైం. అయితే అతణ్ణి తనే సాగనంపింది. డెలివరీ అయిన తర్వాత విజిటింగ్ వీసాతో తను పుట్టబోయే పాపాయితో కొన్ని రోజులు అమెరికా వెళ్ళి అతనితో ఉండాలనే ప్లాన్. శ్రీకాంత్ అమెరికా వెళ్ళిన తర్వాత, కొన్ని నెలలు బానే గడిచాయి. తర్వాతర్వాత శ్రీకాంత్ ఫోన్‌లు తీయడం తగ్గించాడు. చచ్చేంతగా ప్రేమించిన అతగాడు పాప పుట్టిన తర్వాత కూడా తనను ఎందుకు దూరం పెడుతున్నాడు? అయితే అతను చాలా బిజీగా ఉన్నాను, ప్రాజెక్ట్ వర్క్... అసలు ఖాళీలేదు.. అంటూ చెప్పేవాడు. అయితే అమెరికాలో ఉన్న రేణుక స్నేహితుల ద్వారా కొన్ని విషయాలు తెలిశాయి.

శ్రీకాంత్ అమెరికా వెళ్ళిన తర్వాత అక్కడ కొత్తగా కొన్ని రిలేషన్స్ ఏర్పరుచుకున్నాడని తెలిసింది. అంతే... ఆ విషయం ఆమెను తీవ్రంగా వేదనకు గురించేసింది. ఒకరోజు తను పనిచేసే ఆఫీసులోనే నైట్ షిఫ్ట్‌లో హెవీ డోస్ నిద్రమాత్రలు మింగింది. ఆ సమయంలో ఉన్న ఆమె కొలిగ్ భార్గవ్ అనే అతను ఆ విషయం గమనించి వెంటనే ఆస్పత్రిలో చేర్పించాడు. గండం గడిచింది. గట్టిగా తిట్టారు అక్క, బావగారు. ‘సంవత్సరం వయసున్న పిల్లను వదిలి పోదామనుకున్నావా? నువ్వు కన్నతల్లివా? కసాయివా?’ అన్నారు.

ఆ తర్వాత ఒక నెలపాటు ఆఫీసు మాన్పించేశారు. జరిగిన విషయం తెలిసిన శ్రీకాంత్ ఎన్నిసార్లు ఫోన్ చేసినా, రేణుక ఫోన్ ఎత్తలేదు. ఇప్పుడు, కట్టుకున్న భర్తమీద ద్వేషం, తనను చావు అంచునుంచి బయటకు తీసుకొచ్చిన భార్గవ్ మీద ప్రేమ.

ఇది జరిగి సంవత్సరం అయ్యింది. మూడుముళ్ళు వేసిన భర్తను దూరం పెట్టింది. మృత్యువు నుంచి బయటకు తీసుకువచ్చిన భార్గవ్‌కు దగ్గరైంది. ఇంచుమించు లివ్ ఇన్ రిలేషన్. అయితే భార్గవ్‌కు కూడా పెళ్ళైంది. రేణుక కూతురి వయసే ఉన్న కొడుకున్నాడు. అతగాడూ తన భార్యతో ఉన్న వైరుధ్యంతో రేణుకకు దగ్గరయ్యాడు. అయితే రేణుకకు అంతర్గతంగా ఒక గిల్టీ, భర్త చేసిన తప్పే తనూ చేస్తోందా అని. ఆమె ఎపోలజిటిక్‌గా అయిపోయింది. ఆమె భర్త ఫోన్ చేయడం పూర్తిగా ఆపేశాడు. అది కూడా బాధ కలిగించే విషయమే!

ఈ రకమైన ఒత్తిడిలో ఆమెలో మళ్ళీ సూసైడల్ టెండెన్సీ మొదలైంది. రేణుక సమస్య ఇంటిల్లిపాదికీ సమస్యే అయ్యింది.

అలోచనలతోనే బుర్ర వేడెక్కిన నేను దృష్టి మరల్చడానికి కంప్యూటర్ స్క్రీన్‌మీద కనిపించిన యూట్యూబ్ వీడియోల వైపు దృష్టి సారించాను.

'వాస మీడియా అండ్ ఆర్ట్ కలెక్టివ' వారి వీధి నాటకంవైపు నా చూపు పడింది.

హైదరాబాదులోనే ఆ థియేటర్ గ్రూపు ఉంది. తెర, లైట్లు, మేకప్... లాంటివి ఏమీ లేకుండానే ఓ సాయంకాలపు వెలుతురులోనే వీధి నాటకాలు ప్రదర్శించే వర్క్‌షాప్. వాస అంటే వాసంతి, సమీర్. ఆ ఇద్దర్నీ నేను చాలాసార్లు చూశాను. పత్రికకు సంబంధించి రిపోర్టింగ్‌కి వెళ్ళినప్పుడు వాళ్ళను కలిశాను. ఆ దంపతులు మేడ్ ఫర్ ఈచ్ అదర్ లా ఉంటారు. వాసంతి ఒక కాలేజీలో సైకాలజీ లెక్చరర్. సమీర్ కూడా ఒక ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. అయితే ఇద్దరూ కలిసి హాబీగా థియేటర్ మీద కృషి చేస్తున్నారు.

కంప్యూటర్ స్క్రీన్‌మీద వాసంతి ప్రత్యక్షమైంది. పరిశీలనగా ఆమె చెబుతున్న మాటలవైపు దృష్టి సారించాను. "ఇప్పుడు ప్రదర్శించబోయే నాటకంలో నటించేవారందరూ నటన తెలిసివారు కాదు. జీవితంలో నటించినవారూ కాదు. తమకెదురైన దుర్భర పరిస్థితుల్ని ధైర్యంగా ఎదుర్కొన్నవారు. పురుషాధిక్యత, కులాధిపత్యం, వ్యవస్థల నుంచి న్యాయం జరగకపోవడం, సామాజిక అవమానాలు, కుటుంబ సభ్యులే వెలివేయడం... ఇలాంటి సమస్యలతో హింసకు గురైన బాధితులే వారి పాత్రలను పోషిస్తారు"

ఆ మాటలు వినగానే నాకు ఆసక్తి అధికమైంది.

బాధితులే నటులు! ఒక అరగంటసేపు ఆ స్త్రీ మూర్తులు చేస్తున్న ప్రదర్శనలో లీనమైపోయాను. వాసంతి సైకాలజీ లెక్చరర్‌గానే కాకుండా ఆవిడ కౌన్సిలింగ్ కూడా చేస్తారని తెలుసు. రేణుక సమస్యని ఆవిడ ముందు పెడితే ఎలా ఉంటుంది? అనుకున్నాను ఆ ప్రదర్శన చూశాక.

వెంటనే వాసంతి నెంబరుకు ఫోన్ చేశాను. 'అరగంట తర్వాత మాట్లాడండి' అంటూ ఫోన్ మెసేజ్ వచ్చింది.

ఆ అరగంటసేపూ మా బాస్ చెప్పిన విషయం గురించి ఆలోచిస్తూ, గూగుల్‌లో సెర్చ్ చేయడం ప్రారంభించాను.

ఆయన చెప్పిన టాపిక్ గురించి సెర్చ్ చేస్తుంటే... చేతులు వణికాయి.

చంద్రశేఖర్ గారు చెప్పిన 'మరణంలో మేల్కొన్న కల(ము)లు' గురించి సెర్చ్ చేయడం మొదలెట్టాను.

'ఓల్డ్ మేన్ అండ్ సీ' నవలతో నోబుల్ పురస్కారం పొందిన ఎర్నెస్ట్ హెమింగ్‌వే. తను ప్రాణం పోసిన శాంటియోగో పాత్ర ద్వారా పలికించిన నిత్య జీవిత సత్యం అతనికి జీవితం పట్ల ఆశ కలిగించకపోవడం దారుణం. అలాగే 'వర్జీనియా ఉల్ఫ్, ' టు ద లైట్ హౌస్, ఎ రూమ్ ఆఫ్ వన్స్ ఓన' లాంటి నవలల ద్వారా పాఠకులపై ప్రభావం చూపి, తన అభిమానుల టీషర్టులపై తన ఫోటో వేయించుకోగలిగేటంత స్థాయికి ఎదిగిన ఆమె 'బయ్‌పోలర్ డిజార్డర్ ద్వారా అంతఃకల్లోలానికి గుర్తై హూజ్ నదిలో మునిగిపోయి, లండన్ థేమ్స్ నది ఒడ్డున విగ్రహమై తేలింది.

అలాగే తొలి బిలియనీర్ రచయిత జాక్ లండన్, ఆస్ట్రేలియా రచయిత స్టెఫాన్ ఫైక్, ఆమెరికా కవయిత్రి సిల్వియా ప్లాఫ్త్ ఇంకా మన తెలుగు సాహితీ వేత్తలు ' బాక్రానంగల్ డామ్ మీదనుంచి తన జీవితాన్ని కిందకు తోసేసుకున్న బండి గోపాలరెడ్డి, ఆరోగ్య, మానసిక సమస్యలు తట్టుకోలేక హుస్సేన్ సాగర్ జల ప్రవేశంతో తన జీవితానికి ముగింపు పలికిన ప్రముఖ విమర్శకుడు, సాహితీవేత్త డి.రామలింగం, ఛండాల చాటింపు కవిత్వం ద్వారా దళిత సాహిత్యంలోకి తారాజువ్వలా దూసుకొచ్చిన నాగప్పగార్ సుందర్‌రాజు... వీరంతా 'మరణంలోకి మేల్కొన్న కల(ము)లు'.

ఇంతలో వాసంతి చెప్పిన టైము అయిపోయిందని గుర్తొచ్చి, వెంటనే మళ్ళీ ఫోన్ చేశాను. ఆవిడ ఫోనెత్తింది. పరిచయం చేసుకున్నాను.

“తెలుసు. మీ పత్రిక తరఫున మా థియేటర్ వర్క్‌షాప్‌లకు వచ్చారు. ఇంతకీ మీకేం సహాయం కావాలి?” అంది ఆవిడ చిన్నగా.

మా పత్రిక సెప్టెంబర్‌లో తీసుకురాబోయే ‘ఆత్మహత్యల’కు సంబంధించిన బులిటెన్ గురించి చెప్పాను.

ఆ మాటలకు ఆవిడ నవ్వి, “మంచిదే... చాలా పెద్ద టాపిక్కే ఎత్తుకున్నారు. మీరు సాయంత్రం ఆరు తర్వాత మా క్లినిక్‌కు వస్తే మాట్లాడుకోవచ్చు” అంటూ ఫోన్ పెట్టేయబోతుంటే...

“మేడమ్ ఒక చిన్న రిక్వెస్ట్. నా మేనకోడలు రేణుకకు ఒక సమస్య ఎదురైంది. ఆమెకు కౌన్సిలింగ్ కావాలి. నేను ఆమెను తీసుకుని రావచ్చుకదా... స్వామి కార్యం, స్వ కార్యం రెండూ అయిపోతాయి” అన్నాను.

“అలాగే... వచ్చేముందు ఫోన్ చేసి రండి” అంటూ ఫోన్ పెట్టేసింది.

తర్వాతి రోజే అక్కయ్య, రేణుకలతో కలిసి వాసంతి చెప్పిన అడ్రస్‌కు చేరుకున్నాం.

చింతలబస్తీలోని మెయిన్ రోడ్‌లో ఎడమచేతివైపున ఉంది. పైన నివాసం, కింద క్లినిక్.

మేము వెళ్ళేసరికి, క్లినిక్ బయట ముగ్గురు పేషంట్లు కనిపించారు.

అరగంట తర్వాత మాకు పిలుపు వచ్చింది. వెళ్ళేసరికి లోపల వాసంతి ఎదురుగుండా సమీర్ కనిపించాడు. ఆమె పక్కన ఉన్న కంప్యూటర్ స్క్రీన్ మీద ఏవో మెయిల్స్ చెక్ చేస్తున్నాడు. ఇద్దరికీ దాదాపు యాభై ఏళ్ళ వయస్సుంటుందేమో! ఇద్దరూ పరిచయస్తులే కనుక, వారిని చూసి నవ్వాను.

“ఒకే.. మీ పని కానివ్వండి” అంటూ అతను బయటకు వెళ్ళిపోయాడు.

నేను వెంటనే రేణుక విషయం వివరించాను. ఆమె తన స్క్రిబ్లింగ్ పాడ్‌లో నేను చెప్పిన విషయాలన్నీ నోట్ చేసుకుంది. చెప్పడం మొదలెట్టింది `

“హతుడే హంతకుడు అయినప్పుడు దానిని ఆత్మహత్య అంటారు. అయితే ఆత్మహత్యల్లో ఒక అదృశ్యమైన హంతకురాలు ఉంటుంది” అంది వాసంతి.

“కనిపించని హంతకురాలా?” అన్నాను ఆశ్చర్యంగా.

“అవును... అది సమాజం.” అంటూ ఒక క్షణం చెప్పడం ఆపి... ఒక క్షణం ఆలోచనలో పడి, మళ్ళీ చెప్పడం కొనసాగించింది.

“డ్యూర్ ఖైమ్ అనే 19వ శతాబ్దపు సామాజిక శాస్త్రవేత్త ప్రకారం మనషులతో అనుబంధాలు ఎక్కువైనవారు, వారికోసం చనిపోవడానికి సిద్ధమౌతారు. అలాగే మనుషుల్ని అతిగా ద్వేషించేవారు కూడా ప్రేమరాహిత్యంతో ఒంటరివారైపోయి ఆత్మహత్య చేసుకుంటారు. అలాగే అధిక నియంత్రణ వల్ల, తీవ్రమైన నిర్బంధాలను తట్టుకోలేక కూడా ఆత్మహత్య చేసుకుంటారు. అదే క్రమంలో నియమ నిబంధనల్ని ప్రతిబంధకాలుగా భావించేవారుకూడా ఆత్మహత్య చేసుకుంటారు.”

నేను ఆమె మాటలకు అడ్డొస్తూ, “ప్రేమైక స్నేహపూరిత వాతావరణంలో ఆత్మహత్యలు తక్కువగా ఉంటాయి. ద్వేషపూరిత సమాజంలో ఇవి ఎక్కువ. అంతేనంటారా..?” అన్నాను.

ఆ మాటలకు ఆమె వెంటనే `

“అది సరికాదేమో! ఆందోళన, ఒత్తిడి, క్రుంగుబాటు వంటి మానసిక బలహీనతలు కారణంగానే ఆత్మహత్యలు జరుగుతాయని నా ఉద్దేశ్యం” అంది.

అలా ఆత్మహత్యల గురించి చాలా విషయాలు ఆమెతో చర్చించాను. ఆ తర్వాత రేణుకను పిలిచింది.

నేను బయట ఉంటాను అంటే రేణుక ఒప్పుకోలేదు.

“నువ్వు ఉండు మావయ్యా!” అంటూ నన్ను చెయ్యిపట్టి ఆపింది.

రేణుక ద్వారేనే ఆమె అంతర్మథనాన్నంతా మరోసారి వింది వాసంతి.

ఆ తర్వాత ఆవిడ చెప్పడం మొదలెట్టింది `

“ఒక బాటసారి తన గమ్యంవైపు నడుస్తూ, విలపిస్తూ ఉంటాడు. అతని తోటి బాటసారి ‘ఎందుకు బాధపడుతున్నావు? నీ దుఃఖమేమిటి?’ అని అడుగుతాడు. ‘నేనెంతో ప్రేమించిన వ్యక్తి నాకు దూరమయ్యాడు. నేను నడుస్తుంటే, నా కాలు సహకరించడం లేదు. వెనక్కు వెళ్ళిపోతే నాకు దూరమైన వ్యక్తి కనిపిస్తాడేమోనని ఆశ కలుగుతుంది.’ అన్నాడు. అందుకు ఆ బాటసారి ‘నువ్వు వెనకకు అడుగు వేయకు. కొండపైకే ప్రయాణం చెయ్యి. నీకు దూరమైన వ్యక్తి, నీ వెనుక లేదు. అతను నిత్యం నీతోనే, నీ హ□దయంలోనే ఉంటాడు. నువ్వు ప్రేమించిన వ్యక్తి, ఒక జ్ఞాపకంగా మిగిలినపుడు, దాన్ని విలువైనదిగా దాచుకో. అంతగా ప్రేమించిన వ్యక్తి దూరమయ్యాడని, అతనిపై ద్వేషం పెంచుకోకు.’ ఇది ఒక కోణం” అంటూ ఆవిడ చెప్పడం ఆపింది.

నాకు అర్థమైపోయింది... ఆవిడ ఎవరి గురించి ఇప్పటి వరకూ చెప్పిందో. రేణుక ఆలోచనలో పడినట్టు అనిపించింది నాకు.

“ఇంకో కోణం... దూరంగా ఉండికూడా ఒకరిని ప్రేమించవచ్చు. వాళ్ళ మంచి కోరుకోవచ్చు. వారు ఆనందంగా ఉండాలని కోరుకోవచ్చు. అంతేగాని వాళ్ళు మన జీవితంలో ఉండాలని కోరుకోకూడదు. ప్రేమంటే... ప్రేమించిన వారి చేయి పట్టుకుని ముందుకు వెళ్ళడమే కాదు. వారు క్షేమంగా ఉండాలని కోరుకోవడం. ‘నువ్వు బాగుండు కాని అక్కడే ఉండు’ అని మనం అనుకోవడంలో తప్పులేదు. అది స్వార్థం కాదు. కొన్ని సంబంధాలు అగ్గిపుల్లల్లాంటివి. దూరంనుంచే వెలిగించాలి. దగ్గరగా పెట్టుకుంటే చేతులు కాలతాయి. దూరంగా ఉండికూడా ఒకరిని ప్రేమించవచ్చు. వారి మంచిని కోరుకోవచ్చు. వాళ్ళు ఆనందంగా ఉండాలని అనుకోవచ్చు కాని, వారే మన జీవితంలో ఉండాలని కోరుకోకూడదు. సహజీవనంలోనే కాక, ఒక స్నేహితుడుగానో, స్నేహితురాలుగానో ఆత్మీయ జీవనం సాగించలేమా?”

ఆమె రెండోసారి చెప్పిన విషయం, ఎవరి గురించో కూడా నాకు అర్థమైంది. ఆ తర్వాత నన్ను బయటకు వెళ్ళమని చెప్పింది.

అరగంట తర్వాత బయటకు వచ్చిన రేణుక మొహంలో చాలా ప్రశాంతత. అక్కయ్య కూడా చాలా రిలీఫ్‌గా ఫీలయ్యింది.

వాసంతి కౌన్సిలింగ్ చాలా మంచి ఫలితాన్ని ఇచ్చింది అనుకున్నాను. అయితే, ఆ కౌన్సిలింగ్ ఆపనని, మరో రెండు నెలలపాటు కౌన్సిలింగ్ తీసుకోమని వాసంతి చెప్పిందట. అలా వెళ్ళడానికి కూడా రేణుక ఒప్పుకుంది.

‘అమ్మయ్య... సమస్యకు ఒక పరిష్కారం లభించింది’ అనుకున్నాం.

చాలా ఆనందంగా ఇంటికి తిరిగి వచ్చేశాం.

రేణుక వారానికి ఒకసారి వాసంతి కౌన్సిలింగ్ క్లాస్‌కి వెళుతూ, ఆవిడేం చెప్పిందో నాకు మళ్ళీ రిపీట్ చేసేది. ఆవిడ కౌన్సిలింగ్‌లో చాలా మెచ్చురిటీ కనిపించేది. ఆ మాటల్లో ఒక మెస్మరిజం ఉన్నట్టుంది. రేణుకలో చాలా మార్పు వచ్చింది. చాలా ఉత్సాహంగా తన ఉద్యోగ జీవితాన్ని, వ్యక్తిగత జీవితాన్ని మలుచుకోవడం మాకు ఆనందాన్ని కలిగించింది.

ఒక నెల తర్వాత పెళ్ళి కోసం వైజాగ్ వెళ్ళి, రెండు రోజులు అక్కడే ఉండిపోవాల్సి వచ్చింది.

ఆరోజు ఉదయం రేణుక నుంచి ఫోన్ ` సమీర్ హార్ట్ ఎటాక్‌తో చనిపోయాడని. నాకు ఆశ్చర్యం, ఆందోళన రెండూ కలిగాయి.

ఆరోజు ఆమె క్లినిక్‌లోనే అతన్ని చూశాను. చాలా ఆరోగ్యంగా, ఉల్లాసంగా కనిపించాడు.

“అయ్యో! వాళ్ళిద్దరూ ఒకరికోసం ఒకరు పుట్టినట్టుంటారు. దేవుడే అలాంటి జంటల్ని సృష్టిస్తాడేమో” అన్నాను రేణుకతో.

"నీకీ విషయం తెలియదా?" అంది రేణుక.

"ఏ విషయం?" అన్నాను.

"వారిద్దరూ భార్యాభర్తలు కాదు."

"నిజమా?" అన్నాను

"అవును. నేనూ ఇద్దరూ దంపతులే అనుకున్నాను. కాదట! ఆవిడకు ఇంతకుముందే పెళ్ళైంది, పిల్లలున్నారు. అలాగే సమీర్ కూడా వివాహితుడు, అతనికీ పిల్లలున్నారు."

"మైగాడ్!" అన్నాను ఆశ్చర్యంగా.

"వాళ్ళిద్దరూ లివ్ ఇన్ రిలేషన్‌లో ఉన్నారు. పెళ్ళైన తమ సహచరులను వదిలేశారు. ఇద్దరూ కలిసి ఉంటున్నారు. థియేటర్ కలెక్టివ్ వారిని కలిపింది."

నాకు ఆశ్చర్యం రెట్టింపయ్యింది.

అయితే మరో పదిహేను రోజుల తర్వాత మా అక్కయ్య వాళ్ళింటికి వెళ్ళినప్పుడు వాసంతి దగ్గరకు కౌన్సిలింగ్‌కు వెళ్ళడానికి తయారవుతున్న రేణుక, ఎవరికో ఫోన్ చేస్తూ "అయ్యో..." అంటూ సోఫాలో కూర్చుండిపోయింది.

ఆమె పెదాలు వణుకుతున్నాయి. పైన ఫ్యాన్ తిరుగుతున్నా, వంటినిండా చెమటలు.

ఫోన్ నా చేతికిచ్చింది. వాసంతి క్లినిక్‌లో పనిచేసే అటెండెంట్ చెబుతోంది `

ఆరోజు ఉదయమే వాసంతి ఆత్మహత్య చేసుకుందట!

ఆ వార్త కలిగించిన షాక్‌తో నా మెదడు పూర్తిగా మొద్దుబారిపోయింది.

రేణుక వంక చూశాను, ఆమె కళ్ళనిండా దిగులు మేఘం.

ఈ రెండు నెలల్లో రేణుకలో చాలా మార్పు వచ్చింది. ఒక కొత్త వెలుగుతో తన జీవితాన్ని చక్కదిద్దుకుంటోంది. ఇప్పుడు ఆమెలో ఆత్మహత్య గురించిన ఆలోచన లేదు. ఆ సూసైడ్ టెండెన్సీ నుంచి పూర్తిగా బయటపడింది.

రేణుక లాంటి ఎంతోమందికి దారి చూపించిన వాసంతి దారెందుకు తప్పింది? అదో చిక్కువీడని ప్రశ్న అయిపోయింది.

రేణుక కళ్ళనుంచి నీళ్ళు చెలియలి కట్ట దాటిన సముద్రంలాగా. ఆమె బోరుమంటూ ఏడ్చింది.

ఆ తర్వాత కొన్ని రోజులకు వాసంతి, సమీర్‌ల గురించిన కొన్ని విషయాలు నాకు తెలిసి, ఆశ్చర్యపోయాను.

మా అక్కయ్య ఇంటికి వెళ్ళినప్పుడు, కంప్యూటర్‌లో వర్క్ చేసుకుంటున్న రేణుకను పలకరిస్తూ `

"నీ కౌన్సిలింగ్ పూర్తయిన తర్వాతే ఆవిడ తనువు చాలించింది" అన్నాను.

"అవును. నాకు ఇప్పుడు జీవితం గురించి పూర్తిగా అర్థమైంది." అంది రేణుక.

రేణుక వంక సూటిగా చూస్తూ `

"వాసంతి చెప్పలేకపోయిన ఒక పాఠం, ఆమె జీవితం ఇచ్చిన సందేశం ఏమిటో నీకు తెలియాలి. నీలా దారి తప్పిపోయి, మళ్ళీ గమ్యం చేరుకుంటున్నవారికి ఇది తెలియాలి" అన్నాను.

"ఏమిటి మామయ్యా?" అంది రేణుక.

"ఆ విషయాలు నాకు ఈమధ్యనే తెలిశాయి. వాసంతి, సమీర్... ఇద్దరూ చాలా ఏళ్ళుగా సహజీవనంలో

ఉన్నారు. వారి భాగస్వాముల నుంచి, విడాకులుగాని, నిరభ్యంతర పత్రాలు తీసుకోలేదు. వారిద్దరూ ఉద్యోగాలు చేస్తున్నా, తమ కార్యాలయాల్లో, తాము సహజీవనం చేస్తున్నట్టు నమోదు చేసుకోలేదు. పెన్షన్ పత్రాల్లో తమ వారసుల్ని మార్చుకోలేదు."

నేను నా మాటలు పూర్తి చేయకమునుపే, "అవునా" అంది ఆశ్చర్యంగా రేణుక.

"ఇంకో ముఖ్య విషయం... ఆమె క్లినిక్ పెట్టిన ఇంటికి మనం వెళ్ళాం కదా! ఆ ఇంటి స్థలం సమీర్ తాతల తండ్రుల నుంచి వచ్చింది. అయినా ఆమె ఇల్లు కట్టేసింది. తమ మధ్య ప్రేమ, నమ్మకం... ఇవన్నీ ఉన్నప్పుడు అవేవీ అక్కరలేదు అనుకున్నారు. ఆమె సహజీవనం చేసిన సమీర్ చనిపోయాడు. శవాన్ని అతని భార్యా, పిల్లలు తీసుకుపోయారు. పార్థీవ శరీరాన్ని స్వాధీనం చేసుకోవడం అంటే, అతని ఆస్తిపాస్తుల్ని స్వాధీనం చేసుకున్నట్టే"

నేను చెబుతుంటే "మైగాడ్..." అంది రేణుక.

"సమీర్ చనిపోయిన వెంటనే ఇదంతా జరిగిందట! ఆ తర్వాత సమీర్ అన్నదమ్ములు వచ్చి ఆ ఇంటిని కూడా స్వాధీనం చేసుకున్నారు. వాసంతి అన్నింటినీ కోల్పోయింది. ఆమెకి ఏ ఒక్కటీ మిగలలేదు. చట్టం కట్టుబాట్లని ఆ ఇద్దరూ చాలా తేలిగ్గా మామూలుగా తీసుకున్నారు. అయితే దీనివల్ల నీకు అర్థమైంది ఏమిటి?" అన్నాను రేణుక వంక చూసి.

"వివాహాన్ని గాని, ఇలాంటి సహజీవనాల్ని గాని భావోద్వేగాలకి పరిమితం చేయకూడదు. వివాహ బంధమైనా, ఏ బంధమైనా అందులో ప్రవేశించడానికి, బయట పడడానికి కొన్ని నియమాలుంటాయి." చెప్పింది రేణుక.

"మరో సంఘటన కూడా జరిగింది. సమీర్ సంతాప సభలో సమీర్ కూతురు వాసంతితో అందట... 'నువ్వు మా నాన్నతో ఎందుకుంటున్నావ్?' అని. 'అతనంటే చచ్చేంత ప్రేమ' అని చెప్పిందట వాసంతి. ఆ విషయం గుర్తు చేసి, సమీర్ కూతురు 'మా నాన్నంటే చచ్చేంత ప్రేమన్నావ్ ఆరోజు. మరింకా చావలేదేంటి?' అందంట కోపంగా. ఆ సంతాప సభ జరిగిన వారం రోజులకే వాసంతి ఆత్మహత్య చేసుకుంది."

నా మాటలు షాక్ కలిగించినట్టుగా ఉన్నాయి రేణుకకి, నిర్లిప్తంగా ఉండిపోయింది.

ఇప్పుడు 'మరణంలో మేల్కొన్న కల(ము)లు' జాబితాలోకి వాసంతి పేరు చేర్చాను.

ఆరోజు రేణుకను కౌన్సిలింగ్ చేసినపుడు, ఆమె చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి. ఆమె నమ్మిందేమిటి? చేసిందేమిటి? నేను ఆలోచనలో పడ్డాను.

మా దినపత్రికలో వాసంతి గురించి ఎవరో రాసిన కవిత నా మదిలో మెదిలింది.

'ఏ తలపు మెదిలిందో...
ఏ పిలుపు బదులివ్వమందో...
ముగించె తన ప్రయాణం ఈ వాసంతి...
సహచర సమీరుడి కొరకు
ప్రాణాలర్పించుట గొప్పే కాని
ప్రాణాలివ్వదగ్గ సహచరుండుట
ఎంతగొప్పో చెప్పండంటూ... చెప్పకనే
'చచ్చేంత ప్రేమ'తో చెప్పింది.
ఒక సశేష ప్రశ్నను విడిచి వెళ్ళింది.'

★★★★★★